# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఆదివారం 14 డిసెంబర్ 2025


## కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ఎంబీఏకు ఎంపిక



**ఎడ్యుకేషన్ డిసెంబర్ 13 ప్రభాతవార్త:**

ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం లోని ప్రతిష్టాత్మక ఎంబీఏ ప్రోగ్రామ్‌కు సయ్యద్ రాషా మహబూబ్ ఎంపికవడం విశేషంగా నిలిచింది. కఠినమైన ఎంపిక ప్రక్రియలో తన అసాధారణ ప్రతిభను చాటుకుని ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకోవడమే కాకుండా, అకడమిక్ ఎక్సలెన్స్‌కు గుర్తింపుగా Cambridge Distinction Awardను కూడా ఆమె సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా సయ్యద్ రాషా మహబూబ్ భావోద్వేగంగా స్పందించారు. తన జీవితంలో ఈ గొప్ప విజయానికి పునాది వేసింది దివంగత తండ్రి, ఎన్ ఆర్ఐ సయ్యద్ మహబూబ్ బాషా అని గుర్తుచేసుకున్నారు. తండ్రి అందించిన నిరంతర ప్రోత్సాహం, విద్యపై చూపిన అపారమైన ఆసక్తి, తన కలలను ని జం చేయాలనే దృఢమైన మార్గదర్శనం లేకుండా ఈ స్థాయి సాధ్యమయ్యేది కాదని పేర్కొన్నారు. నా ప్రతి అడుగులోనూ నాన్న ప్రేరణ ఉంది. ఆయన కలలు, త్యాగాలే నన్ను ఈ స్థాయికి చేర్చాయి" అంటూ కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. ఆమె సాధించిన ఈ ఘన విజయం విద్యార్థినీ విద్యార్థులకు, ముఖ్యం గా యువతకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది. కృషి, క్రమశిక్షణ, కుటుంబ మ ద్దతు ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమేనని సయ్యద్ రాషా మహబూబ్ సాధన స్పష్టంగా నిరూపిస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు.

## మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

**తొండూరు డిసెంబర్ 13 ప్రభాతవార్త :**



మండలంలోని యాదవారిపల్లె గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల యందు మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు భోజనం తిన్న తర్వాత 9 మంది విద్యార్థులు అశ్వస్తతకు గురయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే రెండు అంబులెన్సుల ద్వారా విద్యార్థులను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడ చికిత్స చేయించడం జరిగింది. విషయం తెలుసుకున్న తొండూరు మండల ఎంఈఓ భారతి హుటాహుటిన పులివెందుల ఏరియా ఆసుపత్రికి వెళ్లి జరిగిన విషయమును తెలుసుకొని విద్యార్థుల తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు విద్యార్థులు తిన్న ఆహారము ఫుడ్ పాయిజన్ గా మారిందని అందువల్ల వారికి వాంతులు విరేచనాలు జరిగాయని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

# అటల్ ఆశయం ప్రధాని మోదీతోనే సాధ్యం..

భారతరత్న వాజపేయి విగ్రహాన్ని కడపలో ఆవిష్కరించిన కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు..





**కడప కార్పొరేషన్, డిసెంబర్ 13 ప్రభాతవార్త:**

మాజీ ప్రధాని, భారతరత్న వాజపేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశం దశ దిశ మార్చిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, సవిత, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిన్.మాధవ్ లు గుర్తుచేశారు. వాజపేయి స్ఫూర్తిని యువతలో నింపేలా అటల్ సందేశ్.. మోదీ సుపరిపాలన యాత్ర తలపెట్టిన భాజపా కార్యవవర్గం తలపెట్టిందన్నారు. వాజపేయి శత జయంతి సందర్భంగా ఈ నెల 11నుంచి 25 వరకు అటల్ సందేశ్ మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా కడప యరముక్కపల్లి కూడలిలో బిజెపి, టిడిపి, జనసేన మూడు పార్టీల నేతలూ కలిసి భారతరత్న వాజపేయి విగ్రహం ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. దేశంలో సుపరిపాలనకు వాజపేయి నాంది పలికారని, ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాది వేశాయని గుర్తుచేశారు. అజాత శత్రువు, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని కొనియాడారు. ఒక సాధారణ కుటుంబలో జన్మించిన ఆయన స్వశక్తితో పదిగి దేశానికి నాయకత్వం వహించారన్నారు. 9సార్లు లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోందన్నారు. పద్దెనిమిదేళ్ల వయసలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని, 1998లో పోఖ్రాన్!!2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తి చాటారన్నారు. కార్గిల్ యుద్ధంలో శత్రువులకు తిరుగులేని సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. నాడు అణు పరీక్ష్కలైనా, నేడు సింధూర్ అయినా, నాడు చతుర్భుజి అయినా నేడు సాగరమాల అయినా.. అవి వన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా దేశాన్ని 2047నాటిక నంబర్ వన్ చేసేందుకు పని చేస్తున్నారన్నారు. యువతరానికి మోదీ స్ఫూర్తినిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, మాధవి రెడ్డి, వరదల్ రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రితేష్ రెడ్డి, హరి ప్రసాద్, బిజెపి నాయకులు శశిభూషణ్ రెడ్డి, బాలకృష్ణ యాదవ్, నాగోతు రమేష్ నాయుడు, వేణు వర్ధన్ రెడ్డి, దయాకర్ రెడ్డి, ప్రవీణ్ నాయుడు, చలపతి, బొమ్మన విజయ్, భాను ప్రకాష్, మనసుల సురేష్, లక్ష్మీనారాయణ రెడ్డి, దేవానంద్, సతీష్ చంద్ర, జనసేన నేత సుంకర శ్రీనివాస్, కూటమి నేతలు బిజెపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

### రాజంపేట అభివృద్ధిపై ఆకేపాటి

# బహిరంగ చర్చకు సిద్ధమా ?

**వైకాపా చేసిన ద్రోహానికి ప్రజలకు క్షమాపణ చెప్పాలి**

**చమర్తి జగన్ మోహన్ రాజు**

**రాజంపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

ఐదేళ్ల వైకాపా పాలనలో రాజంపేటను సర్వనాశనం చేశారనీ, జిల్లా కేంద్రాన్ని పోగొట్టారని, ఇప్పుడు రాయచోటి సెంటర్ పాయింట్ కాలం వల్లే జిల్లా చేశారని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి చిలక పలుకులు పలుకుతున్నారని తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని చెబుతూనే మరో వైపు ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను కడపలో కలపాలని మాట్లాడుతూ ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. వైకాపా హయాంలో ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలు కడపకు దగ్గరని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. రాజంపేటకు వైకాపా చేసిన అన్యాయాన్ని ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. రాజంపేట అభివృద్ధి, సంక్షేమంపై రెఫరెండం కు సిద్ధమా అని సవాల్ విసిరారు.వైకాపా పాలనలో పెత్తనం చెలాయించిన ఎంపీ మిథున్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి రాజంపేటకు ఏమి చేశారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రాలు జిల్లా కేంద్రాలుగా ఎంపిక చేస్తే రాజంపేటను మాత్రం ఎందుకు గొంతు కోశారని ప్రశ్నించారు. తాము చేసింది తప్పని ప్రజల ముందు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే ఎంపీ మిథున్ రెడ్డి పార్లమెంట్ లోను, ఎమ్మెల్యే అమర్ అసెంబ్లీలోను ప్రజలకు క్షమాపణ చెప్పి తర్వాత రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని మాట్లాడాలని హితవు పలికారు. రాజంపేటకు వైకాపా ద్రోహం చేసిందని ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. రాజంపేట జిల్లా కేంద్ర సాధన కోసం జరుగుతున్న ఉద్యమానికి తాము అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని తీసుకోవాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బనరసయ్య నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరు వేణుగోపాల్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మందా శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి జీ.వీ సుబ్బారాజు, ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఎస్కె కరీమ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణరాజు, సొసైటీ డైరెక్టర్ పరశురాం నాయుడు పాల్గొన్నారు.

# ప్రజల మనోభావాలను కూటమి గుర్తించాలి

- రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి...
- ఒకవైపు నిరాహార దీక్షలు...
- మరోవైపు ర్యాలీలు...



నాలుగు రోజు నిరాహార దీక్షలో కూర్చున్న ప్రతినిధులు





జిల్లా కేంద్రం కోసం ర్యాలీ చేస్తున్న ఆటో డ్రైవర్లు

**రాజంపేట, డిసెంబర్13 ప్రభాతవార్త**

ఎంతో ఘన చరిత్ర కలిగి, జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అవకాశాలు ఉన్న రాజంపేటను వెంటనే జిల్లా కేంద్రం చేసి ప్రజల మనోభావాలను గుర్తించాలని వివిధ వర్గాల ప్రజాప్రతినిధులు, ఆటో డ్రైవర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు డిమాండ్ చేశారు. శనివారం నాలుగో రోజు నిరాహార దీక్షలలోనెట్టెం శంకర్, మన్నూరు సురేష్ రెడ్డి, శేషయ్య, చంద్రబాబు, వాసు, మురళి ,నరసింహులు తో పాటు కూటమినేతలు పాల్గొన్నారు. మరోవైపు ఆటో డ్రైవర్లు రాయంపేట జిల్లా కేంద్రం ప్రకటించాలని కోరుతూ పాత బస్టాండ్ లో ఆందోళన చేశారు. ధర్నా చేశారు. అనంతరం పెద్ద ఎత్తున జూనియర్ కళాశాల వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయచోటి వద్దు, రాజంపేట ముద్దు అంటూ నినాదాలు చేశారు. రాజంపేట జిల్లా కేంద్రం ప్రకటించినంతవరకు ఆందోళన విరమించేది లేదని నినాదాలు చేశారు. నిరాహార దీక్షలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోతే చరిత్ర క్షమించదన్నారు. ప్రజల మనోభావాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు పనికిరావు అన్నారు. ఒక ప్రభుత్వం అన్యాయం చేస్తే కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వమైనా న్యాయం చేస్తే కదా అన్నారు. నాలుగో రోజు దీక్షలలో జేపీసీ నేతలు లక్ష్మీనారాయణ ,పూల భాస్కర్,జిల్లా కేంద్రం రాజంపేట కావాలని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, బిల్డర్స్ రిలే నిరాహార దీక్షలు నాల్గవ రోజు రాజంపేట లో కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రం సాధన సమితి సభ్యులు పూల భాస్కర్, అబ్బూరి ప్రభాకర్ నాయుడు, , సుధాకర్ బాబు, సికిందర్ ,చిట్వేల్ రవి కుమార్, రాజశేఖర్ నాయక్, డిఎస్ రావు, డాక్టర్ నవీన్, కొల్లి రెడ్డయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ మద్యం కేసులో మరో ఇద్దరు అరెస్ట్

**మదనపల్లె క్రైమ్, డిసెంబర్ 13 ప్రభాతవార్త**

రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మొలకలచెరువు కల్తీ మద్యం కేసులో శనివారం ఎక్సైజ్ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం తయారుచేసి స్థానికులకు విచ్చలవిడిగా విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పలువురు నాయకులు సహా పట్టుబడడం తెలిసిందే. ఈ కేసులో కేరళరాష్ట్రం, కన్నూర్ జిల్లాకు చెందిన జీనెస్, శిబులను శనివారం అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు.

## స్క్రబ్ టైఫస్ జ్వరాలపై అవగాహన కార్యక్రమం

**డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ**

**కేవీ పల్లె డిసెంబర్ 13, ప్రభాతవార్త;**

స్క్రబ్ టైఫస్ జ్వరాలపై చింతపర్తి పీ. హెచ్. సి. పరిధిలోని గ్రామీణ ప్రజలకు, విద్యార్థులకు, అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమాలు విరివిగా నిర్వహించి అప్రమత్తం చేస్తున్నామని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి ఆదేశాల మేరకు స్థానిక పీ. హెచ్. సి. వైద్యులుడాక్టర్ జులేక బేగం ఆధ్వర్యంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ గండ బోయనపల్లి లో రైతులకు, ప్రజలకు మరియు చింతపర్తి ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులుకు అంగన్వాడీ కార్యకర్తలకు స్క్రబ్ టైపస్ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ మాట్లాడుచు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 1620 కేసులు నమోదు అయి 11మంది చనిపోయారు. ఈ మరణాలకు గల కారణాలు సమీక్ష కొరకు టాస్కోర్స్ బృందం విశ్లేషణ చేస్తున్నారు. మన అన్నమయ్య జిల్లా లో 45కేసులు నమోదు ఐనాయి. మన పక్కన ఉన్న కే. వి. పల్లి, సదుం, మండలాలలో ఇప్పటికే కేసులు నమోదు ఐనాయి.

స్క్రబ్ టైఫస్ అనేది ఒక చిగ్గర్ అనే చిన్న పురుగు కాటు వల్ల వచ్చే ఇన్ఫెక్షన్. ఈ వ్యాధి ఒరియాంటియ సుషుగముషి లేదా రికెటీషియా అనే బాక్టీరియా వల్ల వస్తుంది. ఈ బాక్టీరియాను కలిగిన పేడపురుగు మనిషిని కుట్టినపుడు ఈ బాక్టీరియా మానవుని లోకి ప్రవేశించి ఐదు నుండి ఎనిమిది రోజులు తరువాత వ్యాధి లక్షణాలు బయట పడతాయి. ఇది సాధారణంగా పొలాలు, గడ్డి, పొదలు, పశువుల, గొర్రెల పాకలు, దిబ్బలు వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుంది. కాటు వేసిన చోట నల్ల మచ్చ (ఎస్కార్) ఏర్పడుతుంది మరియు తీవ్రమైన జ్వరం వస్తుంది. ఈ వ్యాధి లక్షణాలు 5 రోజులకంటే ఎక్కువగా జ్వరం ఉండుట. శరీరంపై నల్ల మచ్చలు ఏర్పడుతాయి. తలనొప్పి, శరీర నొప్పులు ఉంటాయి. ఊపిరి తీసుకోవడం లో ఇబ్బంది, బలహీనత, అలసిపోవడం. ఈ వ్యాధి వల్ల ఊపిరి తిత్తులు, కిడ్నీ, మెదడు పనిచేయడం లో మందకోడి గా ఉంటాయి. ఈ వ్యాధి నిర్ధారణ కు రక్త పరీక్ష (ఐ. జి. ఎమ్. ఎలిసా) పరీక్ష ఏరియా హస్పటల్, జిల్లా హస్పటల్ లో ఉచితంగా చేస్తారు.చికిత్స లో భాగంగా డాక్టర్ ఇచ్చే డాక్సీసైక్లిన్ లేదా అజీథ్రోమైసిన్ మందులతో పూర్తిగా నయం అవుతుంది. జ్వరం ఎక్కువ రోజులు ఉన్నవారు తక్షణం వైద్యుని సంప్రదించాలి.సూచించిన ప్రకారం పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని మరియు వ్యాధి ఎలా నివారించాలి అనే దానిపై సాధారణ ప్రజల కోసం సూచనలు పాటించాలని తెలిపారు. ముక్యంగా1. పొలాలు లేదా గడ్డి ప్రాంతాలకు వెళ్లేప్పుడు పూర్తి చేతుల షర్టులు, పూర్తి ప్యాంట్, మూసివున్న బూట్లు ధరించాలి.2. చిగ్గర్ కాట్లను నివారించడానికి బెంజాయిల్ బెంజాట్ ఉన్న రిపెలెంట్లు చర్మంపై/బట్టలపై ఉపయోగించాలి.3. నేలపై కూర్చోవడం/వాలడం అవసరైతే గుడ్డ/పరుపు ఉపయోగించాలి.4. చుట్టుపక్కల గడ్డి, పొదలు తొలగించాలి.5. మైట్ నివాసాలను తగ్గించడానికి కీటకనాశకాలు డి. డి. టి. లేక పైరిత్రం వంటివి స్ప్రే గా ఉపయోగించాలి.6. ఇళ్ల చుట్టూ శుభ్రత, ఎలుకలను, పంది కుక్కలను నియంత్రించాలి (ఎలుకలు మైట్‌కు వాహకాలు)బోరియలను పూడ్చి వేయాలి.రైతులు పొలాల దగ్గర పై జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పై లక్షణాలు కన్పించిన యెడల ఆలస్యం చేయకుండా సమీపంలో ఉన్న ఆశా కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని తద్వారా నివారణ చర్యలు ఆరోగ్య, వ్యవసాయ శాఖ లు చేపట్టడం జరుగుతుంది అనీ భాదితులకు మెరుగైన వైద్యం కొరకు ఉన్నత అస్పత్రికి రెఫెర్ చేయడం జరుగుతుంది అన్నారు.అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సి. హెచ్. ఓ అరుణ,పర్యవేక్షకులు భానుబి, అంగన్వాడీ పర్యవేక్షకులు భానులక్ష్మి, సీనియర్ ఏ. ఎన్. ఎమ్ హృదఈశ్వరి, మగ ఆరోగ్య కార్యకర్త వలిసాబ్ ఆశాకార్యకర్తలు పార్వతి, స్వరూప, అనురాధ, ఉపాధ్యాయ బృందం ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# నిరసనలతో దద్దరిల్లిన నేషనల్ హైవే

**ర్యాలీలో పాల్గొన్న అతికారి కృష్ణ.... సవితమ్మకు వినతి**







**సిద్ధవటం,డిసెంబర్ 13 ప్రభాతవార్త**

కడప చెన్నై జాతీయ రహదారి మాధవరం గ్రామం నందు సిద్దవటం ఒంటిమిట్ట మండలాలు, అన్నమయ్య జిల్లా,రాయచోటిలో విలీనంపై చేపట్టిన దీక్ష కార్యక్రమానికి రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొన్నారు పలు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు చేపట్టిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు కడప జిల్లా ముద్దు, రాయచోటి వద్దు అంటూ విద్యార్థులు నిరసనలతో హోరెత్తడంతో హైవే రోడ్డు దద్దరిల్లి రాకపోకలకు కాసేపు అంతరాయం ఏర్పడింది ఈ సందర్భంగా శనివారం జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా పార్టీలకు అతీతంగా జేఏసీ ఏర్పాటుచేసి మండల సాధన కొరకై చేస్తున్న దీక్షలకు నా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నానని తెలిపారు విద్యార్థులు మేధావులు, ఉపాధ్యాయులు న్యాయవాదులు పార్టీల ప్రజాప్రతినిధులు ఏకతాటిపై కొచ్చి మండల సాధన కొరకై చేస్తున్న నిరసన కార్యక్రమాలు రాష్ట్ర అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తానని తెలిపారు రాజంపేట వైపు నుండి కడపకు వెళ్తున్న కడప జిల్లా ఇంచార్జ్ మంత్రి సవితమ్మ కాన్వాయ్ నిలుపుదల చేసి సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల సమస్యలపై రాష్ట్ర మంత్రి దృష్టికి జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ తీసుకెళ్లగా రాజంపేట జిల్లా కేంద్రం సాధన కొరకై ప్రజల అభిప్రాయం మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర మంత్రుల కమిటీలో రాజంపేట ప్రధానంగా ఉందని ఒంటిమిట్ట సిద్ధవటం రెండు మండలాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని గత ప్రభుత్వం తప్పిదం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని రాజంపేట జిల్లా కేంద్రం ప్రకటించకుండా నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేశారని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, పార్లమెంట్ ఉపాధ్యక్షులు పుత్త రామచంద్రయ్య, టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్ మండల జేఏసీ సభ్యులు, ఎన్నారై చంద్ర, ఏ కుల రాజేశ్వరి రెడ్డి,డేరంగుల శ్రీకాంత్, రవికుమార్,, వినోద్, శ్రీరామదాసు వెంకట్, అనిల్ కుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ, రామ్మోహన్ నాయుడు పలు విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా... శ్రీనివాస కళ్యాణం...

**ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 13, ప్రభాత వార్త**

తిరుమలగిరి వాసుడు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం శనివారం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గోవింద భక్త బృందం ఏర్పాటు చేసిన ప్రత్యేక కళ్యాణ వేదిక పై తిరుమల అర్చక బృందం వారి వేదమంత్రోచ్చారణల నడుమ, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణల మధ్య కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పద్మావతి, మహాలక్ష్మి సమేత శ్రీనివాసుని కల్యాణం తిలకించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపిపి నంద్యాల రాఘవరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్ నాయుడు, మాజీ టిటిడి బోర్డు మెంబరు మారుతీ ప్రసాద్ తదితర పుర ప్రముఖులు పాల్గొన్నారు.



## మదనపల్లిలో విద్యార్థిపై దాడి

**మదనపల్లి క్రైమ్ డిసెంబర్ 13 ప్రభాతవార్త**

మదనపల్లి లో ఇంటర్ విద్యార్థిపై శనివారం రాత్రి ప్రత్యర్థులు మూకుమ్మడిగా దాడి పాల్పడ్డారు. విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పుంగునూరు మండలం చంద్రమాకుల పల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన రాజబాబు, కళావతి దంపతుల కుమారుడు నాయుని రెడ్డిప్రసాద్ (19) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువు తున్నాడు. ఈ క్రమంలో స్థానిక కోమటి వాని చెరువు వద్ద రెడ్డిప్రసాద్‌ను చుట్టుముట్టిన కొందరు దాడి చేశారు. కింద పడి ఉన్న రెడ్డి ప్రసాద్‌ను స్థానికులు గుర్తించి, స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, ప్రధమ చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉందని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనపై రెండవ పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దంపతులను వరించిన రాష్ట్ర పదవులు

**పీలేరు డిసెంబర్ 13 ప్రభాతవార్త:**





అఖిల సనాతన సంఘటనకు సంబంధించి ఆంధ్ర రాష్ట్రం వ్యాప్తంగా హిందూ సనాతన ధర్మం యొక్క విశిష్టత మరియు ఆవశ్యకతల గురించి ప్రచారం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా హిందూ జాతిని జాగృతం చేసేందుకు అఖిలభారత సనాతన సంస్థ జాతీయ అధ్యక్షులైన కేతన్ భాయ్ పరామర్,గుజరాత్ వారు డాక్టర్ పి .వి ఎస్ లక్ష్మి మరియు డాక్టర్ రాయల సుధాకర్ రాయల్ను రాష్ట్రవ్యాప్త పదవులకు ఎన్నుకోవడం జరిగింది.పాతికేళ్లుగా యోగా రంగంలో సేవలు అందిస్తున్న డాక్టర్ పి.వి .ఎస్ లక్ష్మి ని ఆంధ్ర ప్రదేశ్ మహిళా విభాగం అధ్యక్షురాలుగా మరియు 30 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న డాక్టర్ రాయల సుధాకర్ రాయలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సనాతన సంఘటన స్టేట్ కోఆర్డినేటర్ గా నియమించడం జరిగింది. ఈ నియామకం పట్ల రాష్ట్రవ్యాప్తంగా రాయల దంపతులకు అభినందనలు వెల్లువెత్తాయి. తమ యొక్క సేవా తత్పరతను కష్టించి పని చేసే మనస్థత్వాన్ని గుర్తించి రాష్ట్ర వ్యాప్త పదవులకు ఎంపిక చేయడం పట్ల వారు సంతోషిస్తూ తమ బాధ్యత మరింత పెరిగిందని వ్యాఖ్యానించారు.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



పీలేరులో నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

**పీలేరు డిసెంబర్ 13 ప్రభాతవార్త:**

పీలేరులో నవోదయ 5వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా నవోదయ ప్రవేశ పరీక్షకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రేమరాణి చీఫ్ సూపరింటెండెంట్ గా వ్యవహరించారు. ఈ పరీక్ష కేంద్రానికి డిపార్ట్మెంటల్ ఆఫీసరుగా వ్యవహరించిన మండల విద్యాశాఖ అధికారిణి – 2 బి. పద్మావతి మాట్లాడుతూ, నవోదయ 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 230 మంది విద్యార్థులకుగాను 209 మంది విద్యార్థులు హాజరయ్యారని, మరో 21 నంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు గైర్హాజరు అయ్యారని చెప్పారు. పరీక్ష ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు నిర్వహించడం జరిగిందని అన్నారు. మదనపల్లి వలసపల్లి నవోదయ పాఠశాల ఉపాధ్యాయిని బిందు పరీక్ష కేంద్రం పరిశీలకురాలుగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రేమ రాణి చీఫ్ సూపరింటెండెంట్ గా వ్యవహరించారు.

## అబ్దుల్ గఫూర్‌కు పరామర్శ

**చిన్నమండెం డిశంబర్ 13 ప్రభాతవార్త:**



శనివారం మండలంలోని చావిడిగుంట వీధిలో ఉండే టిడిపి మైనార్టీ నాయకుడు మహమ్మద్ తండ్రి అబ్దుల్ గఫూర్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటి దగ్గరికి వెళ్లి మంత్రి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి పరామర్శించారు .వారిని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వీరితోపాటు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## భవన నిర్మాణం కోసం 20 వేలు విరాళం

**పులివెందుల, డిసెంబర్ 13 ప్రభాతవార్త :**



పులివెందుల పట్టణంలోని జగనన్న కాలనీ కి వెళ్లే 100 అడుగుల రోడ్ మార్గాన స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మిస్తున్న నూతన భవన సముదాయ నిర్మాణం విషయం తెలుసుకున్న లిటరరీ అసోసియేషన్ క్లబ్ అధ్యక్షులు బాలిరెడ్డి, కార్యదర్శి స్వామి నాథ్ రెడ్డి లు 20వేల రూపాయలు విరాళం మొత్తాన్ని వారు క్లబ్ ఆవరణం నందు స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కు అందజేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కోవిడ్ 19 విపత్తు లలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి బృందం చేసిన సేవలకు మెచ్చి, అలాగే అంధత్వ నివారణ కోసం కార్నియా సేకరణ (నేత్రదానం), ఉచిత కోచింగ్ రంగాలలో అందిస్తున్న విశిష్ట సేవలకు గాను స్నేహిత అమృత హస్తం సేవల విస్తృతికి భవన సాముదాయం అవసరం ఎంతైనా ఉందని అందుకు మా వంతు బాధ్యత గా లిటరరీ అసోసియేషన్ క్లబ్ తరపున 20 వేలు ప్రస్తుతం ఈ విరాళం అందజేస్తున్నామన్నారు. ఈ సందర్బంగా రాజు మాట్లాడుతూ విరాళాలు ఇవ్వదలచిన దాతలు 9966509364 కి సంప్రదించాలని కోరుతూ భవన నిర్మాణం లో భాగస్వాములు అయిన లిటరరీ అసోసియేషన్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## సంసిద్ పాఠశాలలో ఘనంగా ఉత్సవాలు

**వేంపల్లె డిసెంబర్ 13 (ప్రభాత వార్త)**

వేంపల్లెలోని సంసిద్ సతీష్ రెడ్డి పాఠశాలలో డిసెంబర్ 12 నుండి 14 వంకు మూడు రోజుల పాటు సంసిద్ ఉత్సవం ఘనంగా జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ పరిమళ దేవి తెలియజేశారు. సంసిద్ సతీష్ రెడ్డి స్కూల్‌లో జరుపుతున్న సంసీద్ ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటరామి రెడ్డి, ఐఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా హాజరయ్యారు. అలాగే ప్రత్యేక అతిథులుగా డాన్స్ అకాడమీ పులివెందుల కు చెందిన రాజా, ప్రొద్దుటూరు డాన్స్ అకాడమీ కి చెందిన చౌషన్ , మాటర్స్ పాల్గొన్నారు. సంస్కృతిక పోటీలను సోలో, డ్యూయెట్ మరియు గ్రూప్ పోటీలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లాసికల్ పోటీలు మరింత ప్రత్యేకతగా నిర్వహించబడగా, ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్లు, నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఎంతో ఆనందంతో, ప్రోత్సాహంతో బహుమతులను స్వీకరించారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారని ప్రిన్సిపాల్ పరిమళ దేవి హర్షం వ్యక్తం చేసారు.



## రాజీ మాత్రమే రాజమార్గం - లోక్‌అదాలత్‌లో 854 కేసులు పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్ మొదటి బెంచ్ లో 11వ అదనపు జిల్లా జడ్జి మహేష్



రెండవ బెంచ్ లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్

**పీలేరు డిసెంబర్ 13 ప్రభాతవార్త:**

లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం మంచి రాజమార్గమని పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి ఏ. మహేష్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా శనివారం స్థానిక 11వ అదనపు జిల్లా న్యాయస్థానం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో రెండు చోట్లా రెండు వేరువేరు బెంచ్ లను ఏర్పాటుచేసి లోక్ అదాలత్లు నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ ఏడీజె కోర్టులో లోక్ అదాలత్ చైర్మన్, 11వ జిల్లా జడ్జి మహేష్ మోటర్ వాహన, బిఎస్ఎన్ఎల్, బ్యాంకు, సివిల్ కేసులను పరిష్కరించారు. రెండవ బెంచ్ లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాల కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా 854 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ బెంచ్‌లలో ఎం. మధుసూదన్ రెడ్డి, మునార్ బీ న్యాయవాదులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాల్లో న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, పోలీసు అధికారులు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, కోర్టు కానిస్టేబుల్స్, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవో నియామకం

**దువ్వూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త:**

మండలం లోని గ్రామ సచివాలయాలకు డిప్యూటీ ఎంపీడీవోలు ప్రభుత్వం నియమించింది. ఖాజీపేటలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎంవి రమణారెడ్డిని పదోన్నతిపై దువ్వూరు డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన గ్రామ సచివాలయాల సిబ్బందికి చెందిన పనితీరు అలాగే అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వూరు మండలంలో గ్రామ సచివాలయాలను సరైన రీతిలో పనిచేసేందుకు కృషి చేస్తామన్నారు.

## నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**కడప కార్పొరేషన్ డిసెంబర్ 13 ప్రభాతవార్త:**

ఏపీఎన్జి జివో కడప సిటీ యూనిట్ కార్యవర్గ సమావేశంలో నగర యూనిట్ కు 9 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని కడప జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్య, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యం.వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్ జిల్లా కోశాధికారి నాగేశ్వర్ రావులు వెల్లడించారు. కడప ఏపీ ఎన్ జి జి వో హోమ్ నందు కడప సిటీ కార్యవర్గ సమావేశం అధ్యక్షులు కంభం చిన్నయ్య, కార్యదర్శి సైలెశ్వే ర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా జి.సాంబ శివరావు, సహా అధ్యక్షుడుగా పి.మల్లికార్జున రెడ్డి, ఉపాధ్యక్షులుగా యం.వెంకట రామరాజు, వై.అంకిరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా జి.వెంకట రాజశేఖరం, పిసి.రాజేష్ రెడ్డి, గణేష్ చౌదరి, పి.యస్ సంగీత, ట్రెజరర్ విజయ్ కుమార్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి టి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, జిల్లా సంయుక్త కార్యదర్శులు నరసింహారెడ్డి, రాజ శేఖర్, పద్మనాభరావు ఇరామియా పాల్గొన్నారు.

## భీమారంగాన్ని హోల్‌సేల్‌గా అమ్మేసిన మోడీ ప్రభుత్వం

**వేంపల్లి: డిసెంబర్ 13 (ప్రభాత వార్త)**



మోడీ ప్రభుత్వం భీమారంగాన్ని టోటల్ గా, హోల్ సేల్ గా ప్రైవేట్ రంగానికి అమ్మేసిందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటివరకు భీమా రంగంలో 74 వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టేటందుకు అనుమతి ఉండేదని, దానిని నూరు శాతానికి పెంచుతూ ఇటీవల కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ చర్య వలన ప్రజల జీవితకాలపు పొదుపు సంక్షోభంలో పడుతుందని ,దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు అని తులసి రెడ్డి అన్నారు. ఈ నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. చిన్నపిల్లలకు ,గర్భిణీలకు ,బాలింతలకు అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కేంద్రాలు ఎనలేని సేవ చేస్తున్నాయని ,వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదని తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం 42 రోజుల పాటు సమ్మె చేశారు. ఆ సందర్భంగా తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చి 18 నెలలు అయినప్పటికీ అంగన్వాడీల సమస్యలను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంటర్లుగా మార్చాలి .వారిపై రాజకీయ వేధింపులకు స్వస్తి పలకాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## హిందూ సమ్మేళనంలో మెమెంటో, పత్రాలు



**వేంపల్లి:డిసెంబర్ 13:(ప్రభాత వార్త)**

ఈరోజు వేంపల్లి లోని మధు రెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగినటువంటి "హిందూ సమ్మేళనం " కార్యక్రమంలో భాగంగా వేంపల్లి తేజ హై స్కూల్ విద్యార్థులు" స్వ ఆధారిత జీవనం" అనే అంశంలో తేజ హై స్కూల్ విద్యార్థులు ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందారని ఆ పాఠశాల కరెస్పాండంట్, హెడ్ మిస్టర్, మహదేవారెడ్డి, నాగేశ్వరమ్మా లు తెలియజేశారు, ఈ అంశం లో ." విదేశీ పానీయాలు, విదేశీ ఆహారాలు, విదేశీ సంస్కృతి వద్దు స్వదేశీ పానీయాలు, స్వదేశీ ఆహారాలు, స్వదేశీ సంస్కృతి ముద్దు"అనే కాన్సెప్ట్ తో తల్లిదండ్రుల పాత్రలోనూ, ఉపాధ్యాయుని పాత్రలోనూ, డాక్టర్ పాత్రలోనూ, ఆరోగ్యాలను దెబ్బ తీసేతీసే పానీ పూరి వ్యాపారిగా, విద్యార్థులుగా.దినేష్ 8వ తరగతి, వసంత్ 8 వ తరగతి, మహేంద్ర 9 వ తరగతి, గణేష్ 7 వ తరగతి, వినోద్ 9 వ తరగతి, నిరంజన్ 7 వ తరగతి, అక్షర 7 వ తరగతి, చరిత 6 వ తరగతి, వేదశ్రీ 6 వ తరగతి, సాయి శ్రీ 5 వ తరగతి అందరూ కూడా వారికి ఇచ్చినటువంటి పాత్రలలో జీవించి అందరి ప్రశంసలు పొందినారు. అలాగే హిందూ సమ్మేళనంలో ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమ్మెంటోలు అందజేశారని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాల కరెస్పాండంట్, హెచ్ ఏం,ఉపాధ్యాయులు, ప్రత్యేకంగా అభినందించారు.

## పుస్తక పఠనం మంచిదే ..

**కొంతమంది పిల్లలు గట్టిగా బయటకు చదివితే నెమ్మదిగా చదవలేవా అంటూ తిడుతుంటాం. కానీ ఇలా పుస్తక పఠనం చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. నిపుణులు. అవేంటంటే..**

✦ పిల్లలు పుస్తకంలో పదాలను గుర్తిస్తూ బయటకు చదివేటప్పుడు వాటిని గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అంతేకాదు విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు. ఇది వారిలో జ్ఞాపకశక్తి పెంచుతుంది.

✦.విని నేర్చుకునే వారిని ఆడియో లెర్నర్స్ అంటారు. ఇలాంటివారు దేన్నైనా శ్రద్ధంగా వినడానికి ప్రయత్నిస్తారు. వారిలో భాషానైపుణ్యం మెరుగుపడి చిన్నతనం నుంచే ఉచ్ఛారణ అలవాటు అవుతుంది. పదాలు సులభంగా నేర్చుకుంటారు.

### వ్యాధి నిరోధక టీకాలు

## సక్రమంగా వినియోగించాలి



**దువ్వూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త:**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భవతులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు వేసే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సక్రమంగా వినియోగించాలని వైద్య సిబ్బందికి డిఎంహెచ్ఓ నాగరాజు సూచించారు. శనివారం మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో ఇమ్యునైజేషన్ కిట్ టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ టీకాలు వేసేటప్పుడు వైద్య సిబ్బంది తప్పనిసరిగా పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు. అలాగే కోల్డ్ చైన్ నిర్వహణపై అవగాహన కల్పించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియలో ఐస్ ఫ్యాక్స్ ప్రాముఖ్యతను వివరించారు. సిబ్బంది విధుల్లో ఉన్నప్పుడు యూనిఫాం ధరించాలన్నారు. ఎవరికి ఏ టీకా వేస్తున్నారో వారికి పూర్తిగా వివరించి టీకాలు వేయాలన్నారు. టీకాలోని మందు అయిపోయిన తర్వాత వాటిని ఏ విధంగా పారవేయాలనే అంశాన్ని కూడా తెలియజేశారు. అనంతరం గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ మల్లేష్, ఎంని యాలజిస్టర్ ఖాజా మొహిద్దిన్, వెంకటరెడ్డి వైద్యాధికారులు సురేష్ బాబు, హేమలత రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఈశ్వరమ్మ ఆరాధనోత్సవాలు.



**చిట్వేలి, డిసెంబర్ 14,ప్రభాతవార్త:**

చిట్వేలి మండల పరిధిలోని కే.ఎస్. అగ్రహారం గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ ఈశ్వరమ్మ మఠంలో అమ్మవారి ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఉత్సవాలు రెండు రోజులపాటు భక్తిశ్రద్ధలతో సాగాయి. శనివారం ఈ ఉత్సవాలలో పాల్గొనేందుకు బళ్లారి, గుత్తి, గుంతకల్లు, మారేడుపల్లి, తాడిపత్రి, ఉరవకొండ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఇరుముళ్ల చెల్లించి, పూర్ణాహుతి నిర్వహిస్తూ అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు ముందుగా, భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి సి.కందులవారి పల్లి గ్రామం వద్ద బస చేసి, అక్కడి నుంచి పాదయాత్రగా చిట్వేలి మీదుగా ఈశ్వరమ్మ మఠానికి చేరుకున్నారు. ఈ పాదయాత్ర సందర్భంగా మేళతాళాలు, భజనలు, నృత్యాలతో అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది ఉత్సవాలను ఒంగోలు అచ్యుతానంద ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీ పరిపూర్ణ సిద్ధానంద స్వామి ఆశీస్సులతో విజయవంతంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## వైవియూ ఇంటర్ కాలేజీయేట్ పోటీలు

**ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 13 ప్రభాతవార్త**

యోగి వేమన యూనివర్సిటీ వార్షిక కాలేజీయేట్ పేజ్ 2 లో భాగంగా వాలీ బాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, ఖో ఖో,చెస్ పోటీలను విద్యార్థినీ విద్యార్థులకు డిసెంబర్ 18,19 వ తేదీన ప్రొద్దుటూరు లోని వై.యస్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులు 18 వ తేదీ ఉదయం 8 గంటలకు వై.యస్.ఆర్ ఇంజనీరింగ్ కలాశాల యందు తమ పేర్లను నమోదు చేసుకోవలెనని నమోదు సమయంలో విద్యార్థులు తమ కాలేజీకి సంబందించిన స్టడీ సర్టిఫికెటి మరియు యస్. యస్. సి. మార్క్స్ మేమోను వారి కళాశాల ప్రిన్సిపల్ తో అటెస్టెడ్ చేయించుకొని నమోదు సమయంలో అక్కడ అధికారులకు అందచేయవలనని పై పోటీలలో గెలుపొందిన కళాశాలల జట్లకు యోగి వేమన యూనివర్సిటీ వారు మొదటి బహుమతిగా 5000/ లతో పాటు ప్రశంసా పత్రం మరియు మేమేంటో ఇవ్వబడును. అలాగే ద్వితీయ స్థానం బహుమతి గా 3000/ లతో పాటు ప్రశంసా పత్రం మరియు మేమేంటో ఇవ్వబడునని అలాగే పోటీలలో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థులకు భోజన మరియు వసతి ఏర్పడు చేయడం జరిగినది అని వై.యస్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జయచంద్ర రెడ్డి తెలిపారు.

## అమ్మాయి తలలో పేలా ?

**చదరువుతున్నా, నిద్రపోతున్నా కొంత మంది చిన్న పిల్లలు అసంకల్పితంగా తలను గోక్కుంటూనే ఉంటారు. పేల సమస్యే ఇందుకు కారణం. చిన్నారి మనస్వి జుట్టేమో ఎప్పుడూ నిర్జీవంగానే కనిపిస్తుంది. తల దువ్వుతుంటే చాలు చుండ్రు పొట్టులా రాలుతుంది.** పిల్లల కురులు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక సతమతమవుతుంటారు చాలామంది తల్లులు. అలాంటివారికోసమే ఈ చిట్కాలు.

**తడి లేకుండా..** ఆటపాటల్లో మునిగి తేలే చిన్నారులకు చెమట ఎక్కువగా పడుతుంది. పనుల ఒత్తిడో, తరవాత మాట వినరనే అనుమానమో చాలామంది తల్లులు.. తలస్నానం చేశాక తడి పూర్తిగా ఆరకుండానే రబ్బరు బ్యాండ్ పెట్టేస్తారు. ఇలా చేయడం వల్లా చుండ్రు ఇబ్బంది పెడుతుంది. జుట్టూ నిర్జీవంగా మారుతుంది. అలాకాకుండా జుట్టుని పూర్తిగా ఆరనిచ్చాక జడ వేయడం, రోజు విడిచి రోజు తప్పనిసరిగా తలస్నానం చేయడం అలవాటు చేయాలి. ఇలా చేస్తే చుండ్రు దరిచేరదు.

**పేలు లేకుండా...** తలస్నానం చేయడానికి ముందు కప్పు కొబ్బరినూనెలో రెండు చుక్కల వేపనూనె కలిపి తలకు రాసి మర్దన చేయండి. అరగంటయ్యాక గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరి. ఇలా వారినికోసారి చేస్తుంటే సమస్య దూరమవుతుంది. లేదంటే ఆముదం కొబ్బరినూనె మిశ్రమాన్నీ పట్టించొచ్చు. వేప, ఆముదంలో ఉండే రసాయనాలు, చేదు.. పేలు పారిపోయేలా చేస్తాయి.

**నిగనిగలాడేలా:** కొబ్బరినూనెలో పచ్చి ఉసిరి ముక్కలు, కాసిన్ని మెంతులు వేసి మరిగించండి. దీన్ని తలస్నానం చేయడానికి ముందు రాసుకోండి. అలానే శీకాయ, కుంకుడు కాయల్ని నీళ్లల్లో ఉడికించి రసం తీయండి. ఈ మిశ్రమాన్ని గాలిచొరని సీసాలో పోసుకుని నేచురల్ షాంపూలా వాడుకోండి.

## నేడు వివేకానంద ఫౌండేషన్ 15వ వార్షికోత్సవం

**కలసపాడు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:**



గత 15 సంవత్సరాలుగా సమాజ హితమే తమ అభిమతంగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న వివేకానంద ఫౌండేషన్ సంస్థ 15వ వార్షికోత్సవాన్ని ఈనెల 14 వ తేదీ ఆదివారం మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో సగిలేరు నది ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో ఘనంగా నిర్వహించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయని సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తెలిపారు ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ నిర్విరామంగా నిస్వార్థంగా దాతల సహాయసహకారాలతో 15 సంవత్సరాలు చేసిన సేవలపై ప్రత్యేకమైన వీడియోను మరియు సేవామృతం అనే పుస్తకాన్ని విడుదల చేయనున్నామన్నారు. సేవాశ్రమంలో గ్రంథాలయాన్ని ప్రారంభించడం, ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం, మానవతావాదులను సత్కరించడం, పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు వివిధ జిల్లాల నుంచి ప్రముఖులు, నియోజవర్గంలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## రైతుబజార్‌లో కిలో నిమ్మకాయలు రూ.20

**మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త :**

మదనపల్లె రైతుబజార్‌లో నిమ్మకాయలు కిలో రూ.20ల చొప్పున వక్రయిస్తున్నట్లు మార్కెట్‌యారుడ చైర్మెన్ జంగాల శివరామ్ తెలిపారు. శనివారం రైతు బజార్‌లో నిమ్మకాయల విక్రయకేంద్రాన్ని చైర్మెన్, వైస్‌చైర్మెన్‌లు ప్రారంభించారు. ఈ సందర్బంగా చైర్మెన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు నిమ్మరైతుల నుంచి కొనుగోలు చేసి రైతుబజార్‌లో విక్రయించడం జరుగుతుందన్నారు. కిలోకు నిమ్మకాయలు 25చొప్పున వస్తున్నాయన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వ పెద్దపీట వేస్తొందన్నారు. మార్కెట్‌యార్డుశాఖ అధికారుల పర్యవేక్షణలో నిమ్మకాయల విక్రయం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ రామిశెట్టి అంజనేయులు, డైరెకటర్ సుబ్రమణ్యంరెడ్డిలు పాల్గొన్నారు.



నిమ్మకాయలు విక్రయిస్తున్న చైర్మెన్, వైస్ చైర్మెన్‌లు

## టిడిపి జిల్లా కార్యదర్శిని పరామర్శించిన బీటెక్ రవి



**వేంపల్లె: డిసెంబర్ 13 (ప్రభాత వార్త)**

కడప జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డి ని పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి శనివారం ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. జయరామిరెడ్డి కి గత కొన్ని రోజులుగా ఆరోగ్యం సరి లేక పోవడంతో ప్రయివేటు హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఉన్నారు. కర్నూలు లోని ఓ ప్రయివేటు హాస్పిటల్ లో చికిత్స తీసుకుని వేంపల్లె లోని ఆయన స్వగృహానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవి, వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగట్టు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, సీనియర్ నాయకులు షబ్బీర్ తదితరులు వెళ్లి జయరామిరెడ్డి ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ల సలహాలు సూచనలు పాటిస్తూ తొందరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. తొందరగా కోలుకొని టీడీపీ పార్టీ కి తమ విలువైన సేవలు, సూచనలు, సలహాలు అందించి పార్టీ ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని జయరామిరెడ్డి ని నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి కోరారు. జయరామిరెడ్డి ని పరామర్శించిన వారిలో చంద్రశేఖర్ రెడ్డి, వేమకుమార్, యాసిన్, మారుతి, వార్డు సభ్యులు కంతూరి వెంకటేష్, కమటం హరికుమార్ రెడ్డి, అశోక్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

## సనాతన ధర్మ రక్షణే మన కర్తవ్యం..



**వేంపల్లి: డిసెంబర్ 13 (ప్రభాత వార్త)**

హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం, మన సంస్కృతి సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందించడం ప్రతి ఒక్కరి కనీస కర్తవ్యం అని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పిలుపునిచ్చారు. శనివారం వెంపల్లె మండల కేంద్రంలో నిర్వహించిన "హిందూ ధర్మ రక్షణ సమ్మేళనం" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బీటెక్ రవి మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రపంచానికే మార్గదర్శి. అటువంటి గొప్ప ధర్మంపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి హిందువులందరూ కులమతాలకు అతీతంగా ఏకం కావాలి. ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. దేవాలయాలు కేవలం ప్రార్థనా మందిరాలు మాత్రమే కావని, అవి మన సంస్కృతికి నిలయాలని, వాటి పవిత్రతను కాపాడటంలో భక్తులు చైతన్యవంతులు కావాలని సూచించారు.నేటి యువత పాశ్చాత్య పోకడలకు లోనుకాకుండా, మన పురాణాలు, ఇతిహాసాల్లోని గొప్పతనాన్ని తెలుసుకోవాలని, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి పునరంకితం కావాలని కోరారు. హిందూ ధర్మ రక్షణ కోసం జరిగే ఏ కార్యక్రమానికైనా, ఏ పోరాటానికైనా తన పూర్తి మద్దతు ఉంటుందని, భక్తుల పక్షాన తాను ఎప్పుడూ ముందుంటానని బీటెక్ రవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వెంపల్లె ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, జనసేన పులివెందుల సమన్వయకర్త డాక్టర్ హారీష్, వేంపల్లి మండల కన్వీనర్ మునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు వేమకుమార్, ఆధ్యాత్మిక వేత్తలు, హిందూ ధర్మ ప్రచారకులు మరియు భారీ సంఖ్యలో భక్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జై శ్రీరామ్ జై హింద్ నినాదాలతో వెంపల్లె పురవీధులు మారుమోగాయి.

## పచ్చి బఠాణీలు.. మెచ్చు గుణాలు

**తాజా బఠాణీలు..** ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదూ! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్ధేస్తుంది. బఠాణీలను క్యాలీఫ్లవర్, క్యాబేజ్, బంగాళదుంప, క్యారెట్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింపవుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటితో స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెందడంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచుగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ చేరిన సూక్ష్మ క్రిములను నశింపచేస్తాయి. వీటిల్లో ఉండే కెరొటినాయిడ్స్, జిక్సాందొథిన్లు కళ్లకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడతాయి.

# సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చొరవ చూపాలి

**ఎడ్యుకేషన్ డిసెంబర్ 13 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వంలో స్పష్టత కొరవడిందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ సమస్యలు పరిష్కారవుతాయని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే మిగిలిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు కూటమి పెద్దలు ఇచ్చిన హామీ మేరకు తమకు రావాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లించడంతోపాటు 12వ పిఆర్సీని అమలు చేసి తమ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుస్తారని భావించారన్నారు. అయితే పిఆర్సీ అమలు సంగతి అటుంచితే, పిఆర్సీ చైర్మన్‌ను నియమించడంలో సైతం కాలయాపన చేస్తున్నారన్నారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలను ఆరు మాసాలలోగా రోడ్ మ్యాప్ ప్రకటించి చెల్లిస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 8500 కోట్ల రూపాయల బకాయిలను మాత్రమే చెల్లించిందని, మిగతా 25 వేల కోట్ల బకాయిల చెల్లింపుకు చర్యలు చేపట్టాలన్నారు. బోధనేతర కార్యక్రమాలలో ఉపాధ్యాయులను భాగస్వాములను చేయబోమనే మాటకు కట్టుబడాలని డిమాండ్ చేశారు. నిరంతరం ఏదో ఒక స్కీమ్ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడి చేయడం మానుకోవాలని హితవు పలికారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక అమలు పేరుతో సెలవు దినాలను, ఆదివారాలను సైతం హరించడం ఆమోదయోగ్యం కాదన్నారు. జనవరి మూడు నాలుగు తేదీలలో పశ్చిమగోదావరిలోని భీమవరంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహ్మద్, ఎ.శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, ఐక్య ఉపాధ్యాయ జిల్లా కన్వీనర్ జి.గోపీనాథ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారావు పాల్గొన్నారు.



## అందాల రాసి రీమాకు సన్మానం

**సుండుపల్లె, డిసెంబర్ 13,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని సుండుపల్లి టౌన్ నివాసి షేక్ జాహుద్ బాషా కుమార్తె రీమా ఇటీవల జైపూర్‌లో జరిగిన మిస్ ఈకో ఇంటర్నేషనల్ ఇండియా 2025 అందాల పోటీల్లో విజేతగా నిలిచినందున సుండుపల్లె మానవతా సభ్యులు కలిసి అభినందనలు తెలియజేసి సత్కరించామని ఉమ్మడి కడప జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్ తెలిపారు. త్వరలో లండన్‌లో జరగబోయే పోటీలలో కూడా విజేతగా నిలవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మానవతా సుండుపల్లె అధ్యక్షులు లక్ష్మయ్య నాయుడు సెక్రెటరీ అమ్మనాయక్ ఆర్థిక కార్యదర్శి నరసింహ మండల కన్వీనర్ కృష్ణంరాజు కో చైర్మన్ నాగేశ్వర సీనియర్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి మహబూబ్‌బాషా, సుబ్రహ్మణ్యం, శ్రీహరినాయుడు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



రీమాను సన్మానిస్తున్న దృశ్యం

## గుంతల రోడ్లకు మరమ్మత్తులు చేపట్టండి.

**తంబళ్లపల్లె డిసెంబర్ 13 ప్రభాతవార్త :**

మండలంలోని రహదారులు గత భారీ వర్షాలకు పలుచోట్ల దెబ్బతిన్నాయి. గుంతలమయమైన రోడ్లలో ద్విచక్ర వాహన ప్రమాదాలు తరచూ జరిగి పలువురు గాయాలపాలైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. తంబళ్లపల్లె, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండెం, మదనపల్లి రహదారులలో అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి గుంతల రోడ్లకు మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంది.



## ఉల్లి రైతుల నిరసనను జయప్రదం చేయండి

**మైదుకూరు, డిసెంబర్ 13, ప్రభాతవార్త:**

ఖరీఫ్ సీజన్లో ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేక నష్టపోయిన ఉల్లి రైతులకు ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి రూ.50 వేలు ఇచ్చి ఆదుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చి రెండు నెలలు అవుతున్న ఇప్పటివరకు అమలు చేయనందుకు నిరసనగా ఈనెల 15వ తేదీన కడప జిల్లా రైతు సేవా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనలో ఉల్లి రైతులు,రైతు శ్రేయోభిలాషులు, ప్రజా సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సేవా సమితి పట్టణ అధ్యక్షుడు కానగూడురు రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకుడు ఏవి.రమణ, సోమశేఖర్, రామకృష్ణ, పుల్లయ్య,సుబ్బరాయుడు, పాల్గొన్నారు.



## ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలి

**రామసముద్రం డిసెంబర్ 13 ప్రభాతవార్త**

మండలంలోని ప్రతి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీకి సంబంధించిన ఇంటి పన్నులు ఆన్లైన్ ద్వారా దుకాణదారులు చెల్లించాలని, తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని. ప్రతిరోజు గ్రామ పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు తమ ఇంటి వద్దకే వచ్చి తడి చెత్త పొడిచెత్తని తీసుకుంటారని మండలం ప్రజలందరూ మంచినీటిని వేడి చేసి నీటిని తాగాలని, ప్రజలందరూ ఐవిఆర్‌కాల్స్ వచ్చినప్పుడు ఒకటి నొక్కండన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు మంచినీటి ట్యాంకుల వద్ద మంచినీటి సరఫరా చేయు పైపులైను లీకేజీ ఉంటే వెంటనే మరమ్మత్తులు చేయించాలన్నారు. ప్రజలకు మంచినీళ్లు అందే విధంగా పంచాయతీ కార్యదర్శులు సహకరించాలన్నారు.



## గెవితిమ్మరాయ స్వామి వారికి ప్రత్యేకపూజలు

**రామసముద్రం డిసెంబర్ 13 ప్రభాతవార్త**

మండలంలోని దిన్నిపల్లె సమీపంలోని మోరు కొండపై వెలిసిన గెవితిమ్మరాయ స్వామి వారి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్ బట్టర్ స్వామివారికి ఆలయ శుద్ధిచేసి పలు రకాల పుష్పములతో అలంకరణ చేసి అర్చనలు అభిషేకలు నిర్వహించి భక్తులకు దర్శన బాగ్యం కల్పించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామిని ఉపసర్పంచ్ రమేష్, కనక రాజు,శ్రీనివాసులు, వెంకటేష్,తదితరులు దర్శించుకున్నారు.



## తంబళ్లపల్లెలో శునకాల స్వైర విహారం.

**తంబళ్లపల్లె డిసెంబర్ 13 ప్రభాతవార్త :**

తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో ఊర కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ కుక్కలు తంబళ్లపల్లెలోని ప్రధాన రహదారులలో సంచరిస్తుండడంతో చిన్నారులు, విద్యార్థులు అటువైపు వెళ్లడానికి భయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కుక్కల సంచారంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. ఈ కుక్కల సంచారం పై పంచాయతీ అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు సైతం పట్టించుకోకపోవడం పై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శునకాల బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## చల్లా రాజన్న ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం

**ప్రొద్దుటూరు డిసెంబర్ 13 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు టిడిపి బీసీ నాయకులు మరియు టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం మైదుకూరు రోడ్డు మైదుకూరు రోడ్డు అన్వర్ హాల్ దగ్గర ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున ఎంతోమంది నిరుపేదలకు కడుపునిండా భోజనం వసతి కల్పిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు భగవంతుడు ఆయనకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగజేయాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్ మూరబోయిన శ్రీనివాస యాదవ్ ప్రసాద్ బంగి శివ జయచంద్ర యేసునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

## అంతరాయం లేని విద్యుత్ అందించడమే లక్ష్యం

### విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యరాజ్ కుమార్

**రాజంపేట, డిసెంబర్13 ప్రభాతవార్త**

సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యతతో కూడిన విద్యుత్తు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు విద్యుత్ శాఖ అన్నమయ్య జిల్లా ఎస్ఈ సత్యరాజ్ కుమార్ తెలిపారు. బ్రాహ్మణపల్లి 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికరణ పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఈఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకుగాను 220 కే.వి బ్రాహ్మణపల్లె సబ్ స్టేషన్ నందు ఆధునీకరణ పనులు చేపడుతున్నామన్నారు. అందుకే ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరిగిందని, 220 కే.వీ సింగిల్ జిబ్రా బజ్‌ను ట్విన్ మోజ్ బజ్‌గా ఆధునీకరిస్తున్నామన్నారు. అలాగే సి.కే పల్లిరేణిగుంట 220 కేవీ వనరును లిలో చేసి రూపాంతరం చేయడం జరుగోతోందని తెలిపారు. ఆకేపాడు, వత్తలూరులో 33 కేవీ ఫీడర్లు నూతనంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. దీనివల్ల రాజంపేట పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందించేందుకు దోహదపడునున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఎస్.ఈ సి.హెచ్ శ్రీరామచంద్రమూర్తి, ఈ.ఈలు వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, చంద్రశేఖర్, డి.ఈ.ఈలు అచ్యుత్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సుబ్బారెడ్డి, గోవింద్, ఏ.ఈ.ఈలు దినేష్ కుమార్, సురేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ

## యువతి అదృశ్యం - కేసు నమోదు

**ముద్దనూరు డిసెంబర్ 13 ప్రభాతవార్త:**

మండలంలోని యామవరం గ్రామానికి చెందిన (19) సంవత్సరాలు గల యువతి ఇంటర్ చదువుతున్నది. నిన్న రాత్రి భోజనం చేసి పడుకున్నది. శనివారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి యువతి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులను చుట్టుపక్కల గ్రామాలకు విచారించగా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి ముద్దనూరు పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ రమేష్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అతుక్కుబడి పట్టాపై అధికారులు చొరవ చూపాలి

**రైల్వే కోడూరు డిసెంబర్ 13 (ప్రభాతవార్త)::**

రైల్వే కోడూరు మండలంలో పలు రైతులకు సంబంధించిన పట్టాలు అతుకుబడి ఉన్నందున పలు రకాల ఇక్కట్లకు రైతులు గురవుతున్నారు ఈ సందర్భంగా దీనిపై జిల్లా ఉన్నత అధికారులు చొరవ చూపాలని నిత్యం తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరగలేక అల్లాడుతున్నామని రైతులు వాపోతున్నారు ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంతం నందు అతుకుబడి పట్టా పై నిరీక్షణతో రైతులు ఎదురుచూస్తున్నారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు చొరవచూపి రైల్వే కోడూరు మండలంలో ఉన్న అతుకుబడి పట్టాపై చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

## అదనం కట్నం కోసం మహిళపై వేధింపులు

**ముద్దనూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త :**

మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన గంగా కృష్ణవేణి ఓబులాపురం గ్రామానికి చెందిన గణేష్‌కు ఆరు నెలల కిందట వివాహమైంది. పెళ్లికి 13 తులాలు బంగారు నగలు కట్నం కింద ఇవ్వడం జరిగింది. భర్త గణేష్ కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధించడంతో శనివారం గంగా కృష్ణవేణి ముద్దనూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై మైనుద్దీన్ ఐదు మంది మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## ప్రశాంతంగా నవోదయ పరీక్షలు.

**తంబళ్లపల్లె డిసెంబర్ 13 ప్రభాతవార్త :**

జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నవోదయ విద్యాలయ ఎంట్రన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్ష కేంద్రానికి మొత్తం 175 మంది విద్యార్థులు కేటాయించగా 140 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 35 మంది గైర్హాజరయ్యారు. తెలుగు మీడియం 58 మంది, ఇంగ్లీష్ మీడియం 113 మంది, ఉర్దూ మీడియం నలుగురు హాజరు కాగా తెలుగు మీడియం లో 19 మంది, ఇంగ్లీష్ మీడియం లో 16 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈఓ త్యాగరాజు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణ హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసులు, మదనపల్లె నవోదయ పాఠశాల ప్రతినిధి సీసా, స్క్వాడ్ చాణుక్య పాల్గొనగా తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్ ఎస్ఐ నజీర్ భాష భద్రత ఏర్పాట్లు చేశారు.



## దూదేకుల శ్రేయస్సుకు కూటమి అధిక ప్రాధాన్యత

### ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్‌బాషా స్పష్టం

**మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త :**

నూర్‌బాషా దూదేకుల శ్రేయస్సుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం బెంగుళూరు బస్టాండులోని టిడిపి కార్యాలయంలో నూర్‌బాషా దూదేకుల సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మదనపల్లె జిల్లాను సాధించడానికి నిర్విరామ కృషి చేసిన ఎమ్మెల్యేకు మదనపల్లె సాధన కీర్తి దక్కుతుందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు ఆర్టీసి 1, 2డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్‌వలి మాట్లాడుతూ నిస్వార్ధమైన ప్రజాసేవకుడు ఎమ్మెల్యే అని కనియాడారు. ప్రజలతో మమేకమవుతున్న ఏకైక నాయకుడని ప్రశంసించారు. జిల్లా కేంద్రంగా ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో పట్టణంలో నూర్‌బాషా దూదేకులకు ఒక కమ్యూనిటీ హాల్, షాదీమహాల్ నిర్మాణాలకు స్థలం కేటాయించాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో తగినంత ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రాంత అధ్యక్షులు ఇందాదుల్లా, చిత్తూరు జిల్లా అధ్యక్షులు షఫిసాహెబ్, దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేంపల్లి అబ్దుల్‌ఖాదర్, ముజీబ్‌హుస్సేన్, రెడ్డిబూ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

## ఆడపూరులో మినీ గోకులం ప్రారంభం

**నందలూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో పశుసంరక్షణ, గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. నందలూరు మండలం ఆడపూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన మినీ గోకులాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో, మంత్రి లోకేష్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు ప్రోత్సాహంతో పశుసంపద సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామన్నారు. మినీ గోకులాల ఏర్పాటు ద్వారా గోవులకు సురక్షిత ఆశ్రయం లభించడమే కాకుండా, రైతులకు సేంద్రీయ ఎరువులు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం గ్రామ టీడీపీ నాయకులు మేడా విజయ శేఖర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టంగుటూరు ఎంపీటీసీ భువన బోయిన పెంచలయ్య, కొండూరు దిలీప్ రాజు, వెంకటేష్ రాజు, రమేష్ రాజు, సుదర్శన్ రాజు, రవిచంద్ర రాజు, రాజశేఖర్ రాజు, కార్తీక్ వర్మ, అచ్యుత్ వర్మ, చుక్క వెంకటేష్, గుజ్జుల ఈశ్వరయ్య, ఇరువురి మురళి, పఠాన్ మెహర్ ఖాన్, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమస్య తెలిపిన వెంటనే పరిష్కార మార్గం

**సుండుపల్లి, డిసెంబర్ 13,ప్రభాతవార్త :**

మండల పరిధిలో ఏ సమస్య ఉన్న తెలిపిన స్పందిస్తూ పరిష్కార మార్గం చూపిస్తున్న చప్పిడి సోదరులు. ఈ భాగంలోనే మండల కేంద్రంలోని సంత గేటు పరిసర ప్రాంతంలో కంపచెట్లు అధికంగా పెరిగిపోవడంతో పందుల సమస్య మరియు మార్కెట్ కు వచ్చే వాళ్లకు చాలా ఇబ్బంది ఏర్పడింది. ఈ విషయాన్ని మండల ప్రజలు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు మండల టీడీపీ అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపై వెంటనే స్పందించిన చప్పిడి సోదరులు తమ సొంత నిధులతో జెసిపి సహాయంతో కంపచెట్లను తొలగించి సంత గేటు పరిసరాలను శుభ్రం చేశారు. స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## జనసేన నాయకులు సమావేశం

**రామసముద్రం డిసెంబర్ 13 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని లక్ష్మీజనార్ధన స్వామి ఆలయ సమీపంలో శనివారం జనసేన నాయకులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జనసేన పార్టీ రాబోయే రోజులు కార్యచరణ గురించి చర్చించడం జరిగింది. జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఎవరు అయితే పార్టీ కి కష్టపడతారో వారు మండల అధ్యక్షులు పదవికి అర్హులు అని పార్టీ నాయకులు అన్నారు. ఈ సమావేశంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులుగా బెస్ట్ బిజినెస్ అవార్డు గ్రహీత నరసాపురం ఎంజిపి వినోద్ కావాలని తెలియజేసారు. ఎంజిపి వినోద్ మాట్లాడుతూ మండల జనసేన పార్టీ అధ్యక్షులుగా నన్ను ఉండాలని కోరుకున్న మీ అభిప్రాయానికి, అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నా. నేను ఎల్ల ప్పుడూ మీకు జనసేన పార్టీ, డిప్యూటీ సి ఎం పవన్ కళ్యాణ్ అభిమానులకు అందుబాటులో ఉంటానని పార్టీ కోసం అహర్నిశలు కష్టపడతానన్నారు. గత వారం జనసేన పార్టీ కార్యాలయం లో నాయకులతో సమావేశం అయ్యానని వారితో పార్టీ బలోపేతం,స్థితి గతులు గురించి చర్చించడం జరిగిందని కార్యకర్తలకు తెలియజేసారు. ఈ సమావేశానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్న.ఈ సమావేశంలో పాల్గొన్నా బేకరీ జనార్ధన, ఎం జి పి వినోద్, ఎస్ వి ఆర్ బాలాజీ,కళ్యాణ్ చక్రవర్తి, జనసేన సూరీ, రఫీ, రెడ్డి బాషా, గొల్లపల్లె సురేష్, చంటి, అశోక్, సికిందర్, వినాయక ట్రావెల్స్ వినోద్, బాబు స్వామి, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.



## ర్యాలీని విజయవంతం చేయాలి

**కురబలకోట డిసెంబర్ 13 ప్రభాతవార్త**

అటల్ మోడీ సుపరిపాలన యాత్రలో భాగంగా మదనపల్లి పట్టణంలో ఆదివారము ఉదయం 10 గంటలకు స్వర్గీయ అటల్ బిహారి వాజ్పేయి కాశ్య విగ్రహ విష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి మండల పార్టీ నాయకులు తిరుమల పాలడైరీ కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తర్ఖండ్ సీఎం పుష్కర్ సింగ్ దామీ, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ఉమ్మడి ఏపీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మంత్రి వై సత్య కుమార్, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవన్ లు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం కురబలకోట మండలం అంగళ్లు నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. బైక్ ర్యాలీని బిజెపి టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



## జాతీయ పెన్షనర్స్‌డే ను జయప్రదం చేయాలి

### విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి




**బద్వేలు అర్బన్ డిసెంబర్ 17 ప్రభాతవార్త :**

ఈనెల 17వ తేదీన బద్వేల్ పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగే జాతీయ పెన్షన్ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని బద్వేల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి తెలిపారు, శనివారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు 1982లో డి ఎస్ నకర సుప్రీంకోర్టులో పోరాటం చేసి సుప్రీంకోర్టు న్యాయమూర్తులైన చంద్ర చూడు ఆధ్వర్యంలో పెన్షన్లు అందరికీ పెన్షన్ అదే విధంగా కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ ఆయనకు రుణపడి ఉన్నామని ఆయన కృషి ఫలితము నేడు విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ పొందుతున్నారని అన్నారు ,పెన్షన్ అనేది హక్కు అని భిక్ష కాదని పోరాటం సరిపిన డిఎస్ నగరకి మేమంతా ఎంతో కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు, అందుకు అనుగుణంగా బద్వేల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో 75 సంవత్సరం నిండిన 11 మంది విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని అన్నారు, ఈ కార్యక్రమానికి ఉపకజానాధికారి మరియు మున్సిపల్ కమిషనర్ బ్యాంకు మేనేజర్ ఎన్జీవో అధ్యక్షులు నరసింహారెడ్డి గ్రామీణ బ్యాంకు మేనేజర్ హాజరవుతున్నట్లు తెలిపారు, మీటింగు అనంతరం భోజనం కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు, విశ్రాంత ఉద్యోగులకు జీవన ప్రమాణ కార్యక్రమం ముఖ్యంగా ఆఫీసులో చేయబడును అని ఆ కార్యక్రమం జనవరి 01 నుంచి ప్రతి ఒక్క పెన్షనర్లు విధిగా వచ్చి లైఫ్ సర్టిఫికెట్ పొందే విధంగా చేసామన్నారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య కోశాధికారి గంగన్న ఉపాధ్యక్షులు ముండ్లపాటి పిచ్చయ్య సభ్యులు సుబ్బయ్య జమాలుద్దీన్, గంజికుంట పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యలపై పోలీసులు ప్రత్యేక దృష్టి

**కలికిరి, డిసెంబరు 13, ప్రభాతవార్త:**

కలికిరి మండల కేంద్రంలో ఉన్న ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు ఇటీవల కలికిరి సీఐగా బాధ్యతలు చేపట్టిన రామచంద్ర ప్రత్యేక దృష్టి పెట్టారు. కలికిరి క్రాస్ నుండి బస్టాండు వైపు వెళ్లే రోడ్డు మార్గంలో ఎప్పుడూ రద్దీగా ఉండడం వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలపడం అదే విధంగా దుకాణదారులు షాపులకు సంబంధించి బోర్డులు రోడ్డులో పెట్టడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గుర్తించిన సీఐ తన సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టారు. సీఐ రామచంద్ర పర్యవేక్షణలో ఎస్సై వెంకటరమణ, ఏఎస్సై మహబూబ్‌బాషాలు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా బోర్డులు పెట్టిన దుకాణదారులకు జరిమానా విధిస్తూ హెచ్చరికలు జారీ చేశారు. ఎవరైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తేలా ప్రవర్తించి ప్రమాదాలు జరగడానికి కారకులైతే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతో కలికిరి క్రాస్ ఆర్టీసీ బస్టాండు సమీపంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయ్యింది. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు విజయ్‌కుమార్, ఎల్.రాజా, సిబ్బంది పాల్గొన్నారు.



## అక్కడ ఆదమరిస్తే ఇక అంతే...

### పలువురు ప్రమాదాలకు గురైనా స్పందించని అధికారులు

**కలికిరి, డిసెంబరు 13, ప్రభాతవార్త:**

మండలంలోని మర్రికుంటపల్లె-కొమ్మేపల్లి రోడ్డు మార్గంలో మల్‌రెడ్డిగారిపల్లి సమీపంలో ఉన్న మల్లయ్యకుంట చెక్‌డ్యాం మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతూ ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెక్ డ్యాం నుంచి ఆ చెక్ డ్యాం తెగిపోవడంతో రోడ్డు ప్రధాన రహదారి గుండా నీరు పోతున్నాయి. నిత్యం నీరు పోవడంతో రోడ్డులో పాచికట్టి వాహనదారులు అక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు అక్కడ ప్రమాదాల జరిగి రక్తగాయాలకు గురై అవిటివారిగా మారారు. ఒక యువకుడు అక్కడ ప్రమాదానికి గురై ప్రాణాలు కూడా కోల్పోయాడు. ఈ సంఘటనపై ఇటీవల మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, గ్రామస్థులు పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. చెక్‌డ్యాం మరమ్మతులు చేయించి అక్కడ ప్రమాదాలు జరగకుండా చూడాలని ఎమ్మెల్యేకి విన్నవించడం జరిగింది. దీంతో ఎమ్మెల్యే చెక్ డ్యాం మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు చెక్‌డ్యాంను పరిశీలించారు. కానీ ఇంత వరకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. ప్రస్తుతంకూడా ప్రతినిత్యం ప్రమాదాలు జరుఉగుతూనే ఉన్నాయి. ఆ రోడ్డు మార్గంలో 3 పంచాయతీలకు సంబంధించిన ప్రజలు, మహిళలు, వాహనదారులు మండల కేంద్రమైన కలికిరికి వస్తుంటారు. ఇకనైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి చెక్‌డ్యాం మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ప్రజలు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ రెడ్డిరామ్, గ్రామస్థులు కోరుతున్నారు.

# మామిడి రైతులకు పకృతి వ్యవసాయం ఎంతో లాబదాయకం

### ఎఫ్ఆర్‌డిఎస్ చైర్మన్ రాజశేఖర రాజు

**రాయచోటి టౌన్ డిసెంబర్ 13 ప్రభాతవార్త**

మామిడి తోట రైతులకు పకృతి వ్యవసాయంపై ఎంతో లాభదాయకమని ఎఫ్ ఆర్ డి ఎస్ అధ్యక్షులు రాజశేఖర్ రాజు అన్నారు శనివారం ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ పకృతి వ్యవసాయం పై ఆధారపడి మందులు పిచికారి చేస్తే ఎంతో మంచిదన్నారు అదేవిధంగా సేంద్రీయ వ్యవసాయంతో పండించిన కూరగాయలు తింటే మనుషులు ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు రసాయనిక మందులు క్రిమిసంహారక మందులు వాడటం వలన మామిడి తోట మామిడికాయల పండించిన కాయలను ఎగుమతి చేయడానికి అనుకూలంగా ఉండదన్నారు. మామిడికి ఏప్రిల్ మే జూన్ నెలలో రేట్లు భారీగా పతనమై రైతులు నష్టాల పాలవుతారని రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి లాభాలు రావాలంటే పకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయాలని మామిడి చెట్లకు ద్రావణాన్ని రైతులు తయారు చేసుకోవాలని నిమ్మకాయలు కోడిగుడ్లు బెల్లం ద్రావణాన్ని ద్రావణం తయారీకి పకృతి వ్యవసాయ అధికారులను సంప్రదించాలని వినియోగదారులు పకృతి వ్యవసాయంపై పండించిన పంటలకు ప్రాధాన్యత ఉంటుందని సాగుకు కోళ్ల పెంటలు పచ్చి రొట్టె ఎరువులు వాడితే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. సేంద్రీయ వ్యవసాయం పకృతి సేద్యంతో పండించిన పంటలను వాడాలని కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఇందుకు భారీగా నిధులు కేటాయించిందని ఆ నిధులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

పురుగు మందులు వద్దు జీవామృతం ముద్దు ఇదే రైతుల నినాదం కావాలని రైతులకు ఖర్చు తగ్గాలంటే వ్యవసాయ గిట్టుబాటు కావాలంటే ఆత్మహత్యలు నివారించాలంటే ప్రకృతి వ్యవసాయం సాంద్ర వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు రాయలసీమ ప్రాంతంలో ఉద్యానవన పంటల విస్తీర్ణం భారీగా పెరిగిందని దీనికి కారణం పూజలు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పుణ్యమే అని గాలేరు నగరి తెలుగు గంగా హంద్రీనీవా ప్రాజెక్టు పుణ్యమే అని ఈ ప్రాజెక్టులు పూర్తి అయ్యి పూర్తిస్థాయిలో నీరు అదితే రాయలసీమ నిజంగానే హార్టికల్చర్ హబ్ గా తయారవుతుందని ప్రారంభించి 35 సంవత్సరాలు పూర్తి అయిన ఇంకా పూర్తి కాకపోవడం విచారకరం ఈ ప్రాజెక్టులు పూర్తి అయిన రోజున స్వర్గీయ ఎన్టీఆర్ ఆత్మ సంతోషిస్తుందని రెండు సంవత్సరాలల్లో ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి చేస్తుందని ప్రజల ఆశిస్తున్నారన్నారు



## త్రో బాల్ పోటీలలో డివిజన్ స్థాయి విజేతగా రామసముద్రం ఉపాధ్యాయులు



రామసముద్రం డిసెంబర్ 13 ప్రభాతవార్త

మదనపల్లి సమీపంలోని శ్రీ వేద పాఠశాలలో డివిజన్ స్థాయిలో జరిగిన త్రో బాల్ పోటీలలో మండలానికి చెందిన మహిళా ఉపాధ్యాయులు ఫైనల్‌లో విజేతగా నిలిచారు. మదనపల్లి డివిజన్ పరిధిలోని 15 మండలాలు ఈ పోటీల లో పాల్గొన్నారు. ప్రతి మండలంతోనూ ఆడి మండలానికి మహిళా ఉపాధ్యాయులు విజేతగా నిలిచారు. గుర్రంకొండ, రామసముద్రం మండలాలు ఫైనల్ కు చేరుకోగా రసవత్తరంగా సాగిన పోటీలో ప్రతిభ కనబరిచి మండల ఉపాధ్యాయులు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా గెలిచిన టీంకు డివిజన్ స్థాయి అధికారులు మెమొంటోలను, ట్రోఫీని అందజేశారు. రామసముద్రం ఎస్టియు ప్రధాన కార్యదర్శి రమాదేవి ఉన్నత పాఠశాల పిడి రమాదేవి అందరిని ఉత్తేజ పరిచి టీం గెలవడానికి కృషి చేశారు. ఈ సందర్భంగా రామసముద్రం మండల విద్యాశాఖ అధికారి హేమలత, ఆంజనేయులు ఎస్టియు అధ్యక్షులు ఆయూబ్ ఖాన్ ఆర్థిక కార్యదర్శి సురేష్, రామసముద్రం, చెంబకూరు, చొక్కాండ్ల పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, రమేష్ బాబు, శ్రీనివాసులు, మండల రిటైర్డ్ ఎంఈఓ రెడ్డప్ప మట్లవారిపల్లి ఉన్నత పాఠశాల పిడి పార్థసారథి, ఏపిమోడల్ పిడి ఇందిర గెలిచిన మహిళా ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

## జిల్లా కేంద్రం చేయాలని ఈ జెఏసి నిరసన



రైల్వేకోడూరు డిసెంబర్ 13 (ప్రభాతవార్త)

రాజంపేట ను జిల్లా కేంద్రం చేయాలని ఈజేఏసీ ప్రెసిడెంట్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట జిల్లా సాధన సమితి ఉద్యమ కార్యాచరణ గురించి చేర్పించడానికి శనివారం సాయి డిగ్రీ కళాశాల నందు ప్రైవేట్ స్కూల్స్ జూనియర్ కాలేజీ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్లు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి రాజంపేటలో జిల్లా కేంద్రం కోసం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ద్వారా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని నినాదాలు చేశారు. త్వరలోనే కార్యాచరణ తెలియజేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఇవ్వాలి

కలసపాడు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:

ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ కుమార్ పాల్గొని మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న అన్ని పథకాల గురించి వివరించారు. యూరియా అన్ని రైతు సేవ కేంద్రం లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా చేస్తున్నామని , ప్రైవేటు డీలర్ ఎవరన్నా యూరియా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మించి అమ్మితే మా దృష్టికి తీసుకుని వస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## అండర్-8 టెన్నిస్‌పోటీల్లో రన్నర్‌గా శ్రీకర్



మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త :

అండర్-8 టెన్నిస్ బాలుర విభాగంలో పులిగడ్డ శ్రీకర్ ఇషాన్ విశేష ప్రతిభ కనపరచి రన్నర్‌గా నిలిచాడు. మదనపల్లె ఎంకెఎన్ స్పోర్ట్స్ అకాడమి కోచ్ ఎం.భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో బెంగుళూరులో జరిగిన టెన్నిస్ పోటీల్లో బాలుడు విశేష ప్రతిభ కనపరచి రన్నర్ ట్రోఫి, సర్టిఫికెట్ అందుకోవడం జరిగింది. శనివారం స్పోర్ట్స్ అకాడమి వారి నుంచి సర్టిఫికెట్ అందుకొన్నారు. ఈసందర్భంగా కోచ్ భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ బెంగుళూరులో మురగన్ అకాడమి ఆఫ్ టెన్నిస్‌స్మ్యాట్, ఓపెన్ టెన్నిస్ లీగ్‌లో జరిగిన పోటీల్లో శ్రీకర్ ఇషాన్ విశేష ప్రతిభ కనపరచి రన్నర్‌గా నిలిచారన్నారు. విద్యార్థి ప్రతిభ పట్ల పలువురు అభినందించారు.

## చెర్లోపల్లెలో అన్నమాచార్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

రాజంపేట, డిసెంబర్ 13 ప్రభాతవార్త

అన్నమాచార్య యూనివర్సిటీకి చెందిన రాష్ట్రీయ సేవా యోజన విద్యార్థులు హస్తవరం చెర్లోపల్లె గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా పాఠశాల పరిసరాల పరిశుభ్రతతో పాటు గ్రామ ప్రజలకు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ సేవా శిబిరంలో భాగంగా విద్యార్థులు పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు పరిసర ప్రాంతాలను శుభ్రపరచి పరిశుభ్రత ప్రాముఖ్యతను చాటారు. ప్లాస్టిక్ రహిత పర్యావరణ అంశంపై పోస్టర్లు, నినాదాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు పాఠశాల ఆవరణలో చెట్లు నాటి పర్యావరణ సంరక్షణపై సందేశాలు అందించారు. అలాగే గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో వైద్య బృందం ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇంకా, బాలబాలికలకు కంప్యూటర్‌లోని వివిధ భాగాలపై ప్రాథమిక అవగాహన సదస్సు, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లల కోసం నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో కోఆర్డినేటర్ డా. కె. జనార్ద న్, ప్రోగ్రాం ఆఫీసర్ రఘునాథ్ ముఖ్య పాత్ర పోషించారు.



శ్రమదానం చేస్తున్న అన్నమాచార్య ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

# మదనపల్లెలో నేడు వాజ్‌పాయ్ విగ్రహావిష్కరణ

### రానున్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్‌ధామి... బహిరంగసభ వద్ద భారీ పోలీస్ బందోబస్తు

మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త :

మదనపల్లె సమీపంలోని అన్నిమయ్య సర్కిల్‌లో ఆదివారం భారతరత్న, మాజీ ప్రధాని అటల్‌బీహారి వాజ్‌పాయి విగ్రహావిష్కరణ చేయనున్నారు. విగ్రహావిష్కరణకు ముఖ్య అతిధులుగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్‌ధామి, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పిఎన్ మాదవ్‌లు హాజరు కానున్నారు. ఈ మేరకు శనివారం విగ్రహావిష్కరణ కార్యక్రమం, బహిరంగసభ నిర్వహించే సభా స్థలాన్ని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వాజపాయ్ కాంస్య విగ్రహావిష్కరణ అనతరం కదిరిరోడ్డులోని టిప్పుసుల్తాన్ మైదానంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రితో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్‌యాదవ్, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, బిజెపి అగ్రనేతలు పాల్గొంటారన్నారు. సభా నిర్వాహించే ప్రాంగణం వద్ద మదనపల్లె డిఎస్‌పి మహేంద్ర ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు పటిష్ట చర్యలు చేపట్టారు. బిటి కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కూడా పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్, నాయకులు

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి హెలిప్యాడ్ నుంచి నేరుగా అన్నమయ్య సర్కిల్‌లోని వాజ్‌పాయి విగ్రహావిష్కరణలో పాల్గొని అనంతరం టిప్పుసుల్తాన్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొంటారు. ఈకార్యక్రమంలో కూటమి పార్టీకి చెందిన బిజెపి, టిడిపి. జనసేన నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లాఅధ్యక్షులు కోరారు.

# శ్రీఈశ్వరి దేవి నామస్మరణతో మారుమోగిన మఠం..





బ్రహ్మంగారిమఠం డిసెంబర్ 13, ప్రభాతవార్త

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి పౌత్రి శక్తి స్వరూపిణి మహిమాన్వితురాలు శ్రీ జగన్మాత ఈశ్వరి మహాదేవి అమ్మవారి 236వ ఆరాధన గురుపూజ మహోత్సవములు మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర శివ కుమార్ స్వామి వారి ఆధ్వర్యంలో అశేష జనవాహిని మధ్య కన్నుల పండగగా కర్ణాటక రాష్ట్రం బళ్ళారి ప్రగతి గ్రూపు వారిచే కోలాటం కళాకారుల నృత్య ప్రదర్శన మధ్య వైభవోపేతంగా జరిగాయి శ్రీ జగన్మాత ఈశ్వరి మహాదేవి అమ్మవారు సజీవ సమాధినిష్ట వహించిన పవిత్ర సుదినము నాడు కావడం తో భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా అమ్మవారిని దర్శించడానికి కర్ణాటక తమిళనాడు రాష్ట్రాలకు సంబంధించిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు ప్రాత కాలం నుండి సుప్రభాత సేవలతో వేద పండితుల మంత్రోచ్చారణలతో, పంచామృతాభిషేకము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం చైర్పర్సన్ కమ్మరి పార్వతి ఉభయ దాతలుగా కుంకుమార్చనతో మొదలైన పూజలు ఉదయకాలమున శ్రీ ఈశ్వరి మహాదేవి అమ్మవారు మాలా దీక్షన అలంకారిణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సహస్ర కుంకుమార్చన లో వందలాదిమంది మహిళా మాతృమూర్తులు పాల్గొని కుంకుమార్చన అభిషేక కార్యక్రమాలు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పావులూరి హనుమంత రావు ఆధ్వర్యంలో మరియు స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అధ్యక్షులు అయపు సురేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి చీర సారే పసుపు కుంకుమ సమర్పించారు అనంతరం దీక్ష మాల అలంకారి రూపంలో శ్రీ ఈశ్వరీ మహాదేవి గ్రామోత్సవముగా తరలివెళ్లి భక్తులకు దర్శనమిచ్చారు భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుండి వచ్చినటువంటి భక్తులకు అన్నదానం మహా వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది భక్తుల కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జగన్మోహన్ రెడ్డి,మఠాధిపతుల సోదరుడు సంపత్ కుమార్ వారి సిబ్బందితో తగు ఏర్పాట్లు చేశారు స్థానిక ఎస్సై శివప్రసాద్ వారి సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పటిష్టమైనటువంటి పోలీసు బందొబస్తిని ఏర్పాటు చేశారు రాత్రికి అమ్మవారి తులాభార సేవ సహస్ర దీపార్చన గ్రామోత్సవం హరికథా కాలక్షేపం జరుగుతున్నట్లు ఆలయ ఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

## అర్హులైన పేదలందరికి పక్కా ఇళ్ళు : ఎమ్మెల్యే



ప్రభుత్వ భూమి మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త :

నియోజకవర్గంలో అర్హులుగా ఉన్న పేదలందరికి పక్కాగృహాలు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శనివారం రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో కలసి పోతబోలు పంచాయితీ వద్ద ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోతబోలు సమీపంలో 100ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా 60ఎకరాల్లో పేదలకు ఇండ్లస్థలాలు కేటాయింపు, 40ఎకరాల్లో పార్కు అభివృద్ది చేసే విధంగా ప్రణాళికలు సిద్దం చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు అర్హులుగా ఉండి ప్రభుత్వ ఇండ్లురాని వారు ధరఖాస్తు చేసుకొన్న వారికి ఈ ప్రాంతంలో ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట గృహనిర్మాణశాఖ పీడీ రమేష్‌రెడ్డి, డిఈ దీన్‌దయాల్, తహశీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ సుబ్రమణ్యం, విఆర్‌ఓ నారాయణలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి పేదలకు అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకొన్నారు. పేదలకు సకాలంలో వైద్యం అందించకపోతే చర్యలు తప్పవన్నారు.

## హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి



మైదుకూరు,డిసెంబర్ 13, ప్రభాతవార్త:

కలియుగంలో సంఘటన శక్తిది అంతిమ విజయం ప్రతి హిందువుల ఆత్మ విశ్వాసాన్ని నింపడం కోసం ప్రతి ఒక్కరిలోనూ జాతీయ భావాలను నిర్మాణం చేస్తూ హిందూ సమాజాన్ని జాగృతం చేయడం కోసం మైదుకూరు పట్టణంలో హిందూ సమ్మేళనాన్ని నిర్వహించాలని హిందూ సమ్మేళన నిర్వహణ సమితి తలపెట్టిన ఈనెల 21న హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని పట్టణ మాధవరాయ స్వామి దేవాలయంలో హిందూ బంధువులందరూ సమావేశం కావడం జరిగింది. ఈ సందర్భంగా హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు మాట్లాడుతూ హిందూ బంధువులందరూ హిందూ మహాసభకు కదలి రావాలని బద్వేల్ రోడ్డు బ్లూ వెల్ హై స్కూల్ మైదానంలో జరిగే కార్యక్రమం ఆదివారం 3 గంటల నుండి 6 గంటల వరకు జరుగు సమావేశంలో హిందూ బంధువులు కదలి వచ్చి జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

బద్వేల్ అర్బన్, డిసెంబర్ 13, ప్రభాతవార్త



పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి మ్మ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి మరియు అభయ అంజనేయ స్వామి దేవాలయంలో శనివారం వీరేశచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం కుంకుమ అర్చన పలు రకాల విశేష పూజలు నిర్వహించడం జరిగింది. ఈ పూజలలో ప్రత్యేక అభిషేక దాతలుగా చంద్ర మోహన్ సతీమణి సుభాషిణి, గుమ్మల పాపి శెట్టి వీరాంజనేయులు సతీమణి రాజేశ్వరి సూర్య ప్రభ కుమారుడు సాయి పవన్ కుటుంబ సభ్యులతో పాటు మస్తాన్ రాజా ప్రత్యేక ఉభయ దాతలు కాగా వసంత లక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



నందలూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:

నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరపల్లి శివాలయం సమీపంలో శ్రీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించిన అయ్యప్ప స్వామి అంబలం పూజ భక్తిశ్రద్ధలతో సాగింది. గురు స్వాములు బాలాంజనేయులు, కుర్రామణి, శివశంకర్‌లు భజన పాటలతో కార్యక్రమాన్ని సుస్వరంగా నడిపి భక్తులను ఆధ్యాత్మిక పరవశ్యంలో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జనసేన పార్టీ నాయకులు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివ ప్రసాద్ పాల్గొని స్వామి వారి కృప కోరారు. శ్రీ అయ్యప్ప సేవా సమితి సభ్యులు జనార్దన్ రెడ్డి, సుబ్బరాయుడు, మహేశ్వర్ రెడ్డి, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం (లడ్డు), వెంకటేష్, మణికంఠ, రుద్రరాజు సాయిరాజు వర్మ, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, లక్మయ్య (చిన్నా)లు ఏర్పాట్లలో కీలక పాత్ర పోషించారు. పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు, మహిళలు, పాల్గొని పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇన్చార్జి మంత్రిని కలిసిన నాయకులు



సిద్ధవటం డిసెంబర్ 13 ప్రభాతవార్త

కడప జిల్లాకు విచ్చేసిన మంత్రివర్యులు సబితమ్మ శనివారం సాయంత్రం కడపలో కలసి సిద్ధవటం ఒంటిమిట్ట మండలాలు అన్నమయ్య జిల్లా రాయచోటి కలుపుతూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ చేయడంపై ప్రజలకు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గతంలో మాదిరిగానే మా మండలాన్ని కడప జిల్లాలో కొనసాగించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సబితమ్మ వినతి పత్రం అందజేయడం జరిగింది మంత్రివర్యులు సానుకూలంగా స్పందించి మీ యొక్క సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరగా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మంత్రి వెంట కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి సిద్ధవటం ఒంటిమిట్ట మండలాల సమస్యలను మంత్రికి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు సిద్ధవటం సింగల్ విండో అధ్యక్షులు దారపునేని దశరథ్ రామానాయుడు తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వీరనాల రామచంద్ర, తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు శనివారం మోహన్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సయ్యద్ జవహర్ భాష, పెద్దపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రతినిధి, తుర్రా ప్రతాప్ నాయుడు, మాజీ ఎంపీపీ, నరసింహారెడ్డి, మామిడి సుబ్బారెడ్డి, తెలుగుదేశం మహిళలు, కోటపాటి సుబ్బమ్మ, షేక్ కమల్ బి, పాలకొండయ్య యాదవ్, బీసీ సిద్ధయ్య, రమణ, వినోదం, వెంకటయ్య, రమణారెడ్డి, మాధవరం మురళి రాయల్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## సత్ప్రవర్తనతో జీవించాలి

బద్వేలు, డిసెంబర్ 13, ప్రభాతవార్త




చెడు నడత కలిగిన పలువురికి అర్బన్ సీఐ లింగప్ప శనివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బద్వేలు అర్బన్ పరిధిలోని చెడు నడత గలవారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## జిల్లా కేంద్రం చేయాలంటూ విద్యార్థుల ర్యాలీ




నందలూరు, డిసెంబర్ 13 ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నందలూరు మండల కేంద్రంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పాఠశాల కరస్పాండెంట్ భూమన శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు సాగిన ర్యాలీలో విద్యార్థులు నినాదాలతో తమ డిమాండ్‌ను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూమన శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ మూడు నియోజకవర్గాలతో ఉన్న అన్నమయ్య జిల్లాలో రాజంపేట భౌగోళికంగా మధ్యస్థంగా ఉండటంతో పాటు రైల్వే మార్గం, విస్తృత మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. రెండు విమానాశ్రయాలకు సమీపంలో ఉండటం రాజంపేటకు అదనపు అర్హత అన్నారు. అన్ని విధాలా అనుకూలంగా ఉన్న రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు లోక్మాన్ సింగ్, శ్రీనివాసులు, సౌరి, శివశంకర్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారికి మహర్దశ



ఓబులవారిపల్లి డిసెంబర్ 13 ప్రభాతవార్త

కడప చెన్నై ప్రధాన జాతీయ రహదారికి . మార్దశ ప్రారంభం అయింది ఎన్నో ఇబ్బందులు ప్రమాదాలు మధ్య కొట్టుమిట్టాడుతున్న ప్రజానీకానికి కొంత లభించినట్లు కనిపిస్తోంది కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి. మరియు ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు శాసనసభ్యులు. శ్రీధర్ సారథ్యంలో జాతీయ రహదారికి రూపురేఖలు మార్చేందుకు 100 కోట్ల రూపాయలు నిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసినట్లు తెలుస్తోంది వీర సహకారంతో జాతీయ రహదారులు తారు రోడ్డు నిర్మాణం పనులు ఇటీవల కొబ్బరికాయ కొట్టి ముక్కా రూపానంద రెడ్డి ఎమ్మెల్యే అరవ శ్రీధర్లు ప్రారంభించారు నుండి రేణిగుంట వరకు జాతీయ రహదారికి తారు రోడ్డు నిర్మాణం పనులు విడతల వారీగా జరుగుతున్నట్లు తెలుస్తోంది ఏది ఏమైనా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు వేగవంతం చేస్తూ రోడ్డు పనులకు ప్రయారిటీ కల్పిస్తూ అన్ని విధాల ప్రజానీకానికి అండగా ఉంటూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు ముందు ముందు రైతు సంక్షేమానికి అనేక సబ్సిడీ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతుకు భరోసా కల్పించి రైతు క్షేమమే రాజ్య క్షేమం అంటూ రైతులకు అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం. ముందుకు వస్తుందన్నారు ఈ కార్యక్రమంలో రాజంపేట అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బిజెపి నాయకులు సాయి లోకేష్ మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు



విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పీలేరు డిసెంబర్ 13 ప్రభాతవార్త:

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని విద్యాశాఖ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ప్రశ్నావళి (క్విజ్) పోటీలు నిర్వహించారు. పీలేరు మండల స్థాయిలో శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో పోటీలు నిర్వహించినట్లు ఎంఈఓ 2 బి. పద్మావతి తెలిపారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ప్రశ్నావళి (క్విజ్) పోటీలు నిర్వహించామన్నారు. వ్యాసరచనలో జరిగిన పోటీలో పీలేరు మండలం, శివరామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్. ఇర్ఫాన్, ఇఫా జమీన్ ప్రథమ, ద్వితీయ స్థానంలో సాధించారన్నారు. వక్తృత్వ పోటీలో ప్రథమ, అద్వితీయ స్థానాల్లో స్థానిక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయ విద్యార్థినులు వి. లాస్యశ్రీ, లేఖన మీరు ఇచ్చారని చెప్పారు. ప్రశ్నావళి (క్విజ్) పోటీలో పట్టణంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానంలోను, అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయం విద్యార్థిని ద్వితీయ స్థానంలో విజయం సాధించారని తెలియజేశారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన విద్యార్థులు 14న ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా జిల్లా పరిషత్ మెయిన్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు బాల మహేష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పిలు జలకనూరి మురళీధర్ రాజు, నాగరాజ, అశోక్, మాధవి శ్వేత, ఉపాధ్యాయులు రెడ్డమ్మ, తస్లీమా, రమేష్ పాల్గొన్నారు.

## వైభవోపేతంగా గోవిందుని శోభా యాత్ర

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 13, ప్రభాత వార్త



ఏడుకొండల పైన కొలవై వున్న దేవదేవుడు శ్రీదేవి భూదేవి సమేతంగా శనివారం ప్రొద్దుటూరు కు వేంచేశారు. సాయంత్రం స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో గోవింద భక్త బృందం ఆధ్వర్యంలో జరగనున్న శ్రీనివాస కళ్యాణ మహోత్సవం టిటిడి వేద పండితుల ఆధ్వర్యంలో జరగనున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో తిరుమలలో వినియోగించే శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ ఉత్సవ విగ్రహాలను ప్రొద్దుటూరు ప్రజల కోసం టిటిడి వారు తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి మున్సిపల్ హైస్కూల్ మైదానం వరకు శోభాయాత్రను గోవింద భక్త బృందం సభ్యులు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని కోలాట నృత్యాలతో ఆకట్టుకున్నారు. భజన బృందాలు, తప్పెట్లు, స్వామి వేషధారణలతో శోభాయాత్ర భక్తిమయంగా సాగింది. నాలుగు వృషభ రాజములు, నాలుగు అశ్వములు, భజన బృందాలు, మహిళల కోలాట నృత్యాలతో శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. పాల్గొన్న ప్రజల గోవింద నామ స్మరణతో ప్రొద్దుటూరు భక్తి పారవశ్యంలో తేలియాడింది.

